


# అద్దంలో అబద్ధం

వి. రతన్ ప్రసాద్

మధ్యాహ్నంనుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం సాయంత్రానికి కాస్త తగ్గిందీ అనుకునేటప్పటికి, మళ్ళీ మొదలయింది. ఎక్కడ తల దాచుకోవటానికి వీలుంటే, అక్కడికి జేరుతున్నారు జనం. వీధిలో లైట్లుకూడా వెలగటం లేదు. ఆ మసక వెలుగులోనే, కొందరు పొట్టకోసం — ఎక్కువ కిరాయి దొరుకుతుందనే ఆశతో రిక్షాలు తొక్కుతున్నారు, అంత వర్షంలోనూ..

అందమైన ఓ అమ్మాయి వస్తోంది దూరంనుంచి. 'గబగబా నడుద్దాం' అనుకుంటున్నా, తడిసిన చీరకుచ్చిళ్ళు కాళ్ళకు అడ్డం పడుతూంటే — అడుగు ముందుకు వేయలేకపోతోంది. తప్పనిసరిగా ఓ ఇంటి అరుగుమీదకు వెళ్ళి మూలగా నిలబడింది.

అప్పటికే కొంతమంది ఆ అరుగుమీదకు చేరారు. వర్షాన్ని గురించీ, పంటలనుగురించీ, రాజకీయాలనుగురించీ రకరకాలుగా ముచ్చటించుకుంటున్నారు వాళ్ళల్లో కొందరు. మరికొందరు, వర్షాన్ని చూస్తూ, 'ఎప్పుడు తగ్గుతుందా, ఎప్పుడు ఇళ్ళకు చేరుకుంటామా' — అని ఆదుర్దాపడుతున్నారు.

ఆ అమ్మాయికూడా కంగారుపడుతోంది.

'శకుంతలను చూసి, రేపు మా ఊరు వెళ్ళిపోతున్నానని చెబుదామని వెళ్ళాను. బయల్దేరేముందు వర్షం సన్నగా తుంపరలా పడుతోంది. లెక్కచేయకుండా బయల్దేరాను. తీరా వాళ్ళింటికి వెళ్ళగానే ఎక్కువయిపోయింది. అసలు వర్షంలో తడిస్తే నాకు పడదు కూడా! ఏ జ్వరమైనా వస్తే, అమ్మమ్మా, మావయ్యా నన్ను రేపు మా వూరు పంపించరు. అయినా ఈ వర్షం ఇలా పట్టుకుందేమిటి బాబూ' — ఇలా రకరకాల ఆలోచనలు ముసురుకుంటున్నాయి ఆమె మనస్సులో.

ఆ అరుగుమీదే, ఆ పిల్ల పక్కనే నుంచున్న ఓ అబ్బాయి ఆలోచనలు మరోలా వున్నాయి.

'ఓహో! ఎవరీ సుందరి? భువి నుంచి దివికి దిగిన గంధర్వకాంత కాదు కదా? ఇంటికి ఎలా వెళ్ళాలీ అని కాబోలు — బెదిరిపోతున్న లేడిపిల్లలా చూస్తోంది. మసక వెలుతురులో — వణుకుతున్న ఆమె పెదవుల ఎర్రతనం అస్పష్టంగా కనిపిస్తోంది. తలలోంచి రాలుతున్న నీటి బిందువులు ముత్యాల్లా జారుతున్నాయి. తడిసి వంటికి అతుక్కుపోయిన చీరలోంచి ఆమె సౌందర్యం ఎల్లోరా శిల్పంలా వుంది. పెళ్ళికాలేదని, శంఖంలాంటి ఆమె మెడే చెబుతోంది. సన్నటి గొలుసుకి వున్న లాకెట్టు — పైటమీదికే వుంది. ఎన్నడూ ఏ అమ్మాయినీ పరీక్షగా చూడనే?. ఇదేమిటీ?...ఈ అమ్మాయెవరో నన్ను ఇంతగా ఆకర్షిస్తోంది! ఇవాళ పొద్దున్న పెళ్ళిచూపులకు వచ్చి, ఓ అమ్మాయిని చూశాం — అమ్మాయి బాగానే వుంది. మిగతా విషయాలు మా వాళ్ళవి వచ్చాయి. కానీ మా నిర్ణయం ఇంటికి వెళ్ళాక తెలియచేస్తూ ఉత్తరం రాస్తామని చెప్పి వచ్చేశాం. 'రేపు మా ఊరికి వెళ్ళిపోతాం' కదా అని తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాం...నేనేమో — 'ఏదైనా

సినీమా చూడాలని' బయల్దేరాను.. ఈ వర్షం మూలంగా, ఇలా అరుగుమీదకు రావటం, ఈ అపురూప లావణ్యవతిని చూడటం జరిగింది...అదేమిటో, ఆ అమ్మాయి స్థానంలో ఈ అమ్మాయి శాశ్వతంగా నిలిచిపోయింది, నా హృదయంలో! ఏమైనా ఈ అమ్మాయినే పెళ్ళి చేసుకుని తీరుతాను'...ఇలా సాగిపోతున్నాయి అతగాడి ఆలోచనలు.

వర్షం మరి కాస్త ఎక్కువయింది. ఇంకా మరికొందరు ఆ అరుగుమీదకు రావటంతో — జనం సర్దుకోవాల్సి వచ్చింది. అలా దగ్గరకు రావటంలో ఆ అమ్మాయి భుజం, ఆ అబ్బాయికి తగలగానే అతని గుండె ఝల్లుమంది.. చటుక్కున ఆ అమ్మాయి ఎడంగా జరిగింది.

అంతలోనే — కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి — ఆ వెంటనే భూమి బ్రద్దలయిపోతున్నట్లు — ప్రక్కనే పిడుగుపడిన శబ్దం! ... ఆ శబ్దం వింటూనే కెవ్వుమని కేకపెట్టి అతని మీదకు ఆ అమ్మాయి ఒరిగిపోవటం — అతను వెంటనే ఆమెను ఓ చేత్తో హృదయానికి హత్తుకుని, కుడిచేత్తో ఆమె ముఖాన్ని పైకి ఎత్తి, వణుకుతున్న ఎర్రని ఆమె పెదాలను ముద్దుపెట్టుకుని వెంటనే తప్పుచేశానన్న భావంతో గభాల్న ఆమెను వదిలేయటం — అన్నీ క్షణంలో జరిగిపోయాయి. అతనిమీది నుంచి, క్రిందకు జారిపోతూ ఆమె నేల మీదకు ఒరిగిపోయింది.

అప్పటికిగానీ, ఎవరో పడిపోయారని తెలియలేదు చుట్టుపక్కలవాళ్ళకు... తీరా ఆ అమ్మాయి లేచిన తరువాత, తననుచూసి అనాలోచితమైనాతప్పుకుండా అసహ్యించుకుంటుందని కృంగిపోయాడు అతను...సిగ్గుపడ్డాడుకూడా!

''అరెరె! ఎవరో అమ్మాయి పడిపోయింది!'' — అంటూ కంగారుగా ఆమెను చుట్టుముట్టి సపర్యలు చేస్తున్న జనాన్ని మెల్లగా తప్పించుకుని, అరుగు దిగి వెళ్ళిపోయాడు అతను.

కొంతసేపటికి ఆ అమ్మాయి లేచింది. వర్షంకూడా తగ్గుముఖం పట్టింది. రిక్షా మాట్లాడి, ఆమెను ఎక్కించి, వాళ్ళింటికి పంపేశారు తక్కినవాళ్లు.

*   *   *

''సావిత్రీ ... సావిత్రీ!......'' పదిహేను నిముషాల కొకసారి భార్యను పిలుస్తూనే వున్నాడు, పరంజ్యోతి.

సావిత్రి తనలో తను నవ్వుకుంటూనే వుంది.

శ్రీకాంత్ దగ్గర్నుంచి టెలిగ్రాం వచ్చినప్పటినుంచీ ఇదే వరస...పరంజ్యోతి క్షణం కాలు ఒక్కచోట నిలపటంలేదు. ఇల్లంతా సర్దేస్తున్నాడు. శ్రీకాంత్ అతనికి ప్రాణస్నేహితుడు!

గుమ్మాలకు వున్న 'కర్టెన్లు' మార్చి ఇస్త్రీవి అమర్చాడు. సోఫా కవర్లు మార్చేశాడు. పెళ్ళయింతర్వాత, శ్రీకాంత్ తన భార్యతోసహా మొదటిసారిగా తమ ఊరు వస్తున్నాడు. వాళ్ళ కోసం ప్రత్యేకంగా ఓ గది ఏర్పాటు చేశాడు. వాళ్ళకు ఏ లోటూ రాకూడదని పదే పదే హెచ్చరించాడు సావిత్రిని... శ్రీకాంత్, పరంజ్యోతుల దేహాలు వేరయినా వాళ్ళిద్దరి మనసులూ ఒకటేనని సావిత్రికి తెలుసు.

పరంజ్యోతి — శ్రీకాంత్, ఇంటర్ నుంచి బి. ఇ.వరకు కలిసి చదువుకున్నారు. హాస్టల్లో ఒకే 'రూం'లో వుండేవారు. చదువులు పూర్తయ్యాక చెరో చోటా ఉద్యోగాల్లో చేరారు — పరంజ్యోతి హైదరాబాద్‌లోనూ — శ్రీకాంత్ విశాఖపట్నంలోనూ!...... ఇద్దరికీ ఉద్యోగాల్లో చేరిన కొద్దిరోజుల్లోనే పెళ్ళిళ్ళయిపోయాయి. కారణాంతరాలవల్ల ఒకరి పెళ్ళికి మరొకరు వెళ్ళలేకపోయారు.

అయితే, ఇద్దరిమధ్యా ఉత్తరాలు మాత్రం నడుస్తూనే వున్నాయి. శ్రీకాంత్ ఆ మధ్యెప్పుడో ఓ ఉత్తరం రాశాడు.

''ఒరే జ్యోతీ! ఎప్పుడో హఠాత్తుగా వచ్చేస్తాం నీ వద్దకు. రాస్కెల్! ఇన్నాళ్ళూ నన్ను చూడకుండా ఎలా వుండగలిగేవురా? నిన్ను అంతగా కట్టేసుకున్న నీ శ్రీమతిని తప్పకుండా చూడవలసిందే! అన్నట్లు మా ఆవిడ అన్నగారు బొంబాయిలో వున్నారు... మమ్మల్ని బొంబాయి రమ్మని మా పెళ్ళయినప్పటినుంచీ ఆహ్వానిస్తున్నారు. దారిలో నిన్నుకూడా చూడొచ్చు కదా అని ఈ ప్రయాణం పెట్టుకున్నాం. హైదరాబాద్‌లో పొద్దున్నే దిగి — అదే రోజు రాత్రి బయల్దేరి బొంబాయి వెడతాం. మళ్ళీ తిరుగు ప్రయాణంలో రెండురోజులు మీ యింట్లో మకాం! మనం కలుసుకున్నాక ఆ రోజు—ఎన్నో కబుర్లూ, విశేషాలూ చెప్పుకుందాం. శలవుకోసం అప్లయిచేశాను. వచ్చే ముందు టెలిగ్రాం ఇస్తాను మళ్ళీ! ఎప్పుడు నిన్ను చూస్తానా అని చాలా ఆత్రుతగా వున్నాను

ఉంటారా

నీ కాంతి''

ఉత్తరం చదువుకుని పొంగిపోయాడు పరంజ్యోతి. ఆ తరువాత పదిరోజులకే టెలిగ్రాం కూడా వచ్చేసింది. ఇక పరంజ్యోతి హడావిడీ ఆనందం చెప్పనలవికాదు.. ఆ రాత్రంతా 'ఇంకా తెలవారదేమీ' అని సినీమా పాటలు పాడుకున్నాడు ఎన్నోసార్లు. టైం గడవటమే కష్టమయిపోతోంది.


ఇంక లాభం లేదనుకుని—''సావిత్రీ! మనం 'సెకండ్ షోకి' వెడదాం ఏదైనా పిక్చర్‌కి'' — అన్నాడు.

తెల్లబోయి చూసింది సావిత్రి. ఇంకా చేయవలసిన ఏర్పాట్లు అలాగే వుండిపోయాయి. పైగా, తెల్లవారుఝామునే

లేచి వాళ్ళను 'రిసీవ్' చేసుకుందుకు స్టేషన్‌కు వెళ్ళాలి.

"ఊఁ! ఊఁ! త్వరగా తయారవ్." తొందరచేశాడు పరంజ్యోతి. అతని మాటకు ఎదురు చెప్పలేక త్వరగా ముస్తాబై బయల్దేరింది.

ఆకాశంనిండా దట్టమైన నల్లని మబ్బులు అలుముకుంటున్నాయి. గాలి మరీ చల్లగా వీస్తోంది. ఏ క్షణంలో నైనా, కుంభవృష్టి పడేలా వుంది. పరంజ్యోతి దారిలో విసుక్కున్నాడు. 'తీరా రేపు కాంతి వచ్చేటప్పటికి వర్షం గాని పట్టుకోదుకదా?. పొద్దున్న



స్టేషన్‌కు కూడా వెళ్ళాలి' – అను కున్నాడు.

సినిమా వదలగానే బయటకొచ్చి ఆశ్చర్యపోయారు, పరంజ్యోతీ సావిత్రీ!... భయంవేసింది కూడా!. బ్రహ్మాండమయిన వర్షం పడుతోంది. హాల్లో కూర్చున్నంతసేపూ తెలియనే లేదు.

కాసేపు అక్కడే వుండిపోయారు. ఇక ఎంతకీ వర్షం తగ్గకపోవటంతో, ఆటోరిక్షా ఎక్కారు. దారి పొడవునా ఎడా పెడా జల్లు కొడుతూనే వుంది. దాదాపుగా ఇద్దరూ తడిసిపోయారు.

ఎలాగో ఇల్లు చేరారు పరంజ్యోతీ– సావిత్రీ. బట్టలు మార్చుకుందుకు 'బెడ్‌రూం'లోకి వెళ్ళారు. కిటికీల్లోంచి బయటి మెరుపులు దూసుకొస్తున్నాయి. అంతలోనే – హఠాత్తుగా పిడుగుపడిన శబ్దం – చెవులు చిల్లులు పడేలా వినిపించటంతో, సావిత్రి భయంలో కెవ్వున కేకవేసి, భర్తను గట్టిగా కౌగలించు కుంది. పరంజ్యోతి గట్టిగా ఆమెను పొదివి పట్టుకొని – అంతలో ఏదో జ్ఞాపకం వచ్చినవానిలా చటుక్కున వదిలేశాడు. అతని కౌగిట్లోంచి జారి నేలమీదకు ఒరిగిపోయింది సావిత్రి – స్పృహలేకుండా.

కిటికీదగ్గరకు వెళ్ళి నుంచున్నాడు పరంజ్యోతి. బయట ఇంకా కుండ పోతగా వర్షం కురుస్తూనే వుంది.

**ఉరుములు** ... మెఱుపులు! చెట్లు గాలికి **పిచ్చిగా** ఊగుతున్నాయి. ఆ చీకట్లో **అవి** జుట్టు విరబోసుకున్న **రాక్షసుల్లా** కనిపిస్తున్నాయి.

వెనక్కి **తిరిగి** చూశాడు. నేలమీద **స్పృహలేకుండా** పడివుంది సావిత్రి... **ఆమెవైపు** తదేకంగా చూశాడు... నెమ్మదిగా వెళ్ళి ఆమెను రెండుచేతులతో ఎత్తి మంచంమీద పడుకోపెట్టి — గుండెలవరకూ రగ్గు కప్పేడు. ఎర్రని ఆమె పెదవులు సన్నగా వణుకుతున్నాయి.

పరంజ్యోతి గాఢంగా నిట్టూర్చి — **కిటికీవద్దకు** కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

మరికొన్ని నిముషాలకు సావిత్రి మెల్లిగా లేచి కూర్చుంది. జరిగిన సంఘటనకు సిగ్గుపడింది. **నెమ్మదిగా భర్త** దగ్గరకు వెళ్ళి —

“రండి...భోజనం చేద్దాం...ఇప్పటికే చాలా పొద్దుపోయింది ” అంది.

‘‘నాకు ఆకలిగా లేదు.. నువ్వు భోంచెయ్’’ — అన్నాడు కిటికీలోంచి వర్షాన్ని చూస్తూ.

‘కాపురానికి వచ్చింతర్వాత ఇన్ని నెలలుగా, ఎన్నడూ తనమీద అలా కోపం తెచ్చుకోలేదు భర్త. అయినా అతనికి కోపం వచ్చేలా తానెప్పుడూ ప్రవర్తించలేదు ... బహుశా, ఇలా ఎప్పుడయినా పిడుగుపడిన శబ్దానికి ఫిట్స్‌లాంటివి వస్తాయని ముందే చెప్పలేదని కోపం వచ్చిందేమో?. అయినా ఈ మధ్య చాలాకాలంగా తనకు ఫిట్స్ రావటంలేదు. తగ్గిపోయాయనే అనుకుంది. ఈ రోజు బాగా అలసివుండటంవల్లా — వానలో తడవటంవల్లా మళ్ళీ అలా వచ్చింది! అంత మాత్రానికే ఈయన ఇలా అయిపోవాలా?' చాలా బాధపడింది సావిత్రి.

“క్షమించండి! ఎప్పుడయినా, ఇదివరకు పిడుగు చప్పుడుకు ఫిట్స్ వచ్చేవి. ఇప్పుడు రావటంలేదు. ముందుగా మీకీ విషయం చెప్పలేదని **కోపం** వచ్చిందా? అదే కారణం **అయితే** నన్ను మన్నించండి” — అంది కన్నీళ్ళు పెట్టుకుంటూ. పరంజ్యోతికి **ఆ** మాటలు **పూర్తిగా** అర్థంకావటం లేదు. **అతని** ఆలోచనలు సుడిగుండంలో చిక్కుకున్న గడ్డిపరకల్లా — గిరగిరా తిరిగిపోతున్నాయి.

**సందేహంలేదు** ... ఆమె...ఈమే! ఆమే...ఈమె! ... ఆమె...సందేహం లేదు...ఈమె ఆమె...అవును...సందేహంలేదు’’— వెయ్యిగొంతులు అతని గుండెలో అరుస్తున్నాయి.. పరంజ్యోతి శరీరం దహించుకపోతోంది. తలలో రైళ్ళు పరుగెడుతున్నాయి.

“నన్ను విసిగించకు. మాట్లాడించకు...దయచేసి ఇక్కడ్నించి వెళ్ళిపో. ప్లీజ్” — సిగరెట్టు వెలిగించుకుంటూ అన్నాడు.

సావిత్రి అభిమానం దెబ్బతింది. అక్కడ నిలబడలేక, వెళ్ళి మంచంమీద **వాలిపోయింది**. రాత్రంతా నిద్రలేదు. ఎన్నోసార్లు చూసింది భర్తని. సిగరెట్లమీద సిగరెట్లు కాలుస్తూ కిటికీలోంచి చూస్తూ — అదే కుర్చీలో కదలకుండా కూర్చునే వున్నాడు. వర్షం తగ్గింది.

ఎప్పుడు నిద్ర పట్టేసిందో—కాలింగ్ బెల్ అదేపనిగా మ్రోగుతూంటే చటుక్కున కళ్ళు తెరచింది సావిత్రి. కుర్చీలోనే నిద్రపోతున్నాడు పరంజ్యోతి.

కాలింగ్ బెల్ మ్రోగుతూనే వుంది. వెళ్ళి తలుపు తీసింది సావిత్రి. లోపలకు దూసుకొచ్చిన శ్రీకాంత్‌నూ అతని భార్యనూ చూసి సిగ్గుపడింది.

‘అయ్యో! నిన్నట్నుంచీ వీళ్ళ రాకనుగురించి కన్న కలలన్నీ ఇలా తెల్లారిపోయాయి. స్టేషనుకు తామిద్దరూ వెళ్ళి — వీళ్ళకు ఘనమైన స్వాగతం చెప్పి ఆహ్వానించాలనుకుంటే — ఆ ప్లానంతా తలక్రిందులయిపోయిందే’ అని మనసులోనే నొచ్చుకుంది సావిత్రి. మొహానికి నవ్వు పులుముకుంటూ ‘‘రండి” అని, శ్రీకాంత్ భార్యచేతిని తన చేతిలోకి తీసుకుని తమ గదిలోకి **దారితీసింది.**

అప్పటికే, శ్రీకాంత్ పరంజ్యోతిని లేపి —

“రాస్కెల్! స్టేషన్‌కి రాలేదు సరికదా హాయిగా నిద్రపోతున్నావా? లే! లే!” అన్నాడు.

నిద్రలేని ఎర్రని కళ్ళని బలవంతంగా తెరచి —**నవ్వుతూ** కనిపిస్తున్న శ్రీకాంత్ వైపు అయోమయంగా చూస్తుండిపోయాడు పరంజ్యోతి.

సావిత్రి కంగారును అణచిపెట్టుకుంటూ — మరో కుర్చీ భర్త వద్దకు లాగి—‘‘కూర్చోండి! వారికి రాత్రంతా జ్వరం...**తెల్లవార్లూ** నిద్రేలేదు. తీరా మీరొచ్చేసమయానికి నిద్ర ముంచుకొచ్చింది. అందుకే స్టేషన్‌కి రాలేకపోయాం. సారీ!” —అంది శ్రీకాంత్ నుద్దేశించి.

“నో! నో! అదేం ఫర్వాలేదండీ! అసలు మా మధ్య అలాంటి ఫార్మాలిటీస్ లేనేలేవు! మీరేం బాధపడక్కర్లేదు...ఒరేయ్—జ్యోతీ! ఇదిగోరా ఈవిడగారే నా భార్యామణి! పేరు సరోజ!’’—అంటూ పరిచయం చేశాడు శ్రీకాంత్.

“నమస్కారం!” — అంది సరోజ మృదువుగా.

చటుక్కున లేచాడు పరంజ్యోతి... ‘సరోజ ... నిజంగా రోజా పుష్పంలాగే వుంది’ — అనుకున్నాడు ప్రతినమస్కారం చేస్తూ... తరువాత టవల్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

శ్రీకాంత్, తమకు ఏర్పాటుచేసిన

గదిలో తన బెడ్డింగ్ విప్పి — బట్టలేవో తీసుకుంటున్నాడు. సావిత్రీ, సరోజా వంటింట్లో కబుర్లు చెప్పుకుంటున్నారు. కాఫీ ఫలహారాలు తయారు చేస్తూనే ఎన్నో విషయాలు అరమరికలు లేకుండా మాట్లాడేసుకుంటున్నారు.


శ్రీకాంత్ కూడా వంటింట్లోకి వస్తూ— "ఓహో! అప్పుడే మీరిద్దరూ మాకంటే ఆత్మీయులయిపోయారే!" అన్నాడు నవ్వుతూ.

"మీరెందుకొచ్చారిక్కడికి? కాళ్ళకూ చేతులకూ అడ్డం!... ఇదండీ సావిత్రిగారూ ఈయనగారి వరస... నేను వంట చేస్తున్నంతసేపూ, వంటింట్లో చేరి ఏవేవో కబుర్లు చెబుతుంటారు" అంది సరోజ నవ్వుతూ.

సావిత్రి మనస్సు చివుక్కుమంది. 'మామూలుగా అయితే ఇప్పుడు తన భర్తమాత్రం తనను నిలవనిచ్చేవాడా? ఎన్ని పరిహాసాలు? ఎన్ని నవ్వులు? ఎంతో హడావిడి చేసేసేవాడు. రాత్రి ఏ దుష్టశక్తి ఆవహించిందో కాని, తన ఆనందాన్ని వేళ్ళతోసహా పెకలించి వేసింది. వీళ్ళుండే ఈ ఒక్కరోజూ నవ్వంగా గడిచిపోతే అంతే చాలు' అనుకుంది.

పరంజ్యోతి ముఖం తుడుచుకుంటూ డైనింగ్ హాల్లోకి వెళ్ళి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు. శ్రీకాంత్ అతని కెదురుగా కూర్చొని టేబిల్‌మీద వున్న గ్లాసును చేత్తో తిప్పుతూ, ఏవేవో విషయాలు మాట్లాడేస్తున్నాడు. వేడి వేడి ఉప్మా — పెసరట్లు తెచ్చారు సావిత్రీ—సరోజా.

ఇద్దరూ కాఫీ టిఫిన్లు కానిచ్చి, గదిలోకి వెళ్ళింతర్వాత సావిత్రీ, సరోజా కూడా టిఫిన్ తింటూ — ఎంతోసేపు ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఎన్నో సంవత్సరాల పరిచయస్థుల్లా — వాళ్ళిద్దరూ కలిసిపోయారు...పరంజ్యోతి మాత్రం శ్రీకాంత్‌పట్ల అపరిచితునిలా ప్రవర్తిస్తున్నాడు. అయితే శ్రీకాంత్ అదేం పట్టించుకోవటంలేదు. అనర్గళంగా మాట్లాడేస్తూ — మధ్య మధ్య సరోజను ఆట్లపట్టిస్తూ నానా హడావిడీ చేస్తున్నాడు...పరంజ్యోతి అంతరంగం అల్లకల్లోలంగానే వుంది. పైకిమాత్రం ఉదాసీనంగా కనిపిస్తున్నాడు.




"రాత్రంతా ఆయనకు జ్వరంకదా పాపం!"— అని జాలిపడింది సరోజ. మనసులో భారంగావున్నా — అతిథి మర్యాదలకేం లోటు చేయటంలేదు సావిత్రి.

రైలు టైం అవుతోంది...సరోజకు బొట్టుపెట్టి — కంచిపట్టుచీర పెట్టింది సావిత్రి. ముందురోజు ఎన్నో షాపులు తిరిగి ఆ చీరను సెలెక్టుచేసి తెచ్చాడు పరంజ్యోతి. తనకుకూడా షాపుకి రమ్మందే ఇంట్లో పనివుందని తాను వెళ్ళలేదు. పొద్దున్న షాపుకైనా సరిగా తెలపకుండానే వెళ్ళిపోయాడు కొనటానికి. సావిత్రికి ఆ విషయం జ్ఞాపకానికొచ్చి మనసు విలవిల్లాడింది.

టాక్సీలో సామానంతా పెట్టించి — 'వెళ్లొస్తాం' అన్నాడు శ్రీకాంత్.


"ఉండు! మేంకూడా వస్తాం స్టేషన్‌కి" అన్నాడు పరంజ్యోతి. సావిత్రి సంతోషించి, ఒక్క క్షణంలో డ్రెస్ చేసుకొని వచ్చింది.

"వద్దులేరా జ్యోతీ! నిన్నంతా జ్వరం. చాలా నీరసంగా వున్నావ్" అంటున్న శ్రీకాంత్‌వైపు ఆవేదనగా చూశాడు పరంజ్యోతి.

"అరేయ్ కాంతీ! నీతో మనసిచ్చి మాట్లాడలేకపోతున్నానురా. నాలో సప్త సముద్రాలు పొంగుతున్నాయ్. కార్చిచ్చు గుండెను దహించేస్తోంది. కర్తవ్యం తోచని అంధకారంలో ఉన్నాన్రా!' అలా పైకి చెప్పలేక-మనసులోనే మథనపడుతున్నాడు.

"పదండి! టైమవుతోంది." సరోజ అందర్నీ హెచ్చరించగానే ఈ లోకంలోకి వచ్చాడు పరంజ్యోతి.

'ప్లాట్‌ఫాం' చాలా సందడిగా వుంది. శ్రీకాంత్ కిటికీదగ్గరసీట్లో కూర్చున్నాడు. సరోజకూడా పక్కనే వున్న మరో కిటికీదగ్గర కూర్చుని క్రిందనున్న సావిత్రితో మాట్లాడుతోంది.




పరంజ్యోతి, తనతో ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నట్లు గ్రహించి శ్రీకాంత్ అన్నాడు-

"జ్యోతీ! బొంబాయినుంచి తిరిగి వచ్చేటప్పుడు రెండురోజులు మీతో గడుపుతానని ఇదివరకు రాసానుకదూ!. ఇంకోసారి ఎప్పుడైనా వస్తాం. బొంబాయినుంచి మద్రాసు వెళ్ళి అట్నుంచి మళ్ళీ అలాగే వైజాగ్ వెళ్ళిపోతాం మళ్ళీ ఎన్నాళ్ళకో..."

పరంజ్యోతి ఇంక ఆగలేక పోయాడు. ఇప్పుడు మాట్లాడలేకపోతే, జీవితంలో ఇంక ఎప్పటికీ తన సందేహం తీరదు!

"ఒరేయ్–కాంతీ...!"

ఆ పిలుపు పూర్వపు పిలుపు... ఆత్మీయత నిండిన పిలుపు... ఆ పిలుపు కోసమే–ఇన్ని మైళ్ళు వచ్చాడతను... శ్రీకాంత్ చలించిపోయాడు.

"జ్యోతీ...ఏమిట్రా?"

"ఏం లేదురా కాంతీ! అప్పుడు... అప్పుడెప్పుడో – అరుగుమీద వర్షంలో కనిపించిన అమ్మాయికోసం – చాలా రోజులు వెతికావ్ కదా? కుదిరిందను కున్న సంబంధాన్ని కూడా వదిలేసి – రాత్రింబగళ్ళు ఆమెనే తల్చుకుంటూండే వాడివి, గుర్తుందా? ఈ ప్రపంచంలో ఏ మూల వున్నా– వెతికి, ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకుని తీరతానని శపథం కూడా చేశావ్...మరి...మరి ఆ అమ్మాయిని......"

"ఓరి రాస్కెల్! ఇప్పుడా నువ్ అడగటం?.. అయినా ఈ శ్రీకాంతంటే ఏమిటనుకున్నావ్ ... ఎన్నో ఊళ్ళు తిరిగి తిరిగి మొత్తానికి సాధించాను. నేను పెళ్ళిచేసుకున్న సరోజ ఎవరో కాదు. ఆ రోజున వర్షంలో–ఆ అరుగు మీద నా ఎదపై వాలిపోయి–నా మదిలో నిలిచిపోయిన అమ్మాయే!"– పరంజ్యోతికి దగ్గరగా వంగి, అన్నాడు గర్వంగా శ్రీకాంత్.

పరంజ్యోతి ముఖం–ఆ క్షణంలో – కారుమబ్బులు విడిపోయిన ఆకాశంలా – స్వచ్ఛమైన అద్దంలా మెరిసింది. ఆ అద్దంలో నిర్మలమయిన వాళ్ళ స్నేహం ప్రతిఫలించింది.

"ఒరేయ్ కాంతీ! నన్ను క్షమించరా. నాలాంటి దుర్మార్గుడు ఇంకొకడుండడురా! నీ రాకకోసం ఎంత ఆనందంతో ఎదురుచూశానో, చివరికి, అంతటి ఆనందాన్ని చేజేతులా నాశనం చేసుకున్నాన్రా! ఈ రోజంతా ఓ పీడ కలలా గడచిపోయింది. అయినా నా కెంత జ్ఞానం లేకపోయింది? ఒకరికి వుండే జబ్బులాంటిది మరొకరికూ–డా వుండవచ్చునేమో ననే సందేహంకూడా రాలేదు. నువ్ ఆరాధించిన అమ్మాయే సావిత్రి అనుకుని–నిన్నటినుంచీ ఎంతో నరకం అనుభవించాను. కాంతీ! నన్ను క్షమించరా..."–అని అందా మనుకున్నాడు పరంజ్యోతి. కానీ గొంతు మూగపోవటంవల్ల ఒక్క–టీ పైకి చెప్పలేకపోయాడు. చెప్పాలను కున్న మాటలన్నీ గుండె అడుగు పొరల్లోనే దాగిపోయాయి.

అయినా అతని మనసంతా ఎంతో హాయిగా వుంది. శరీరం గాలిలో తేలి పోతున్నట్లుంది.

"కాంతీ! వచ్చేటప్పుడు నువ్ తప్పకుండా ఇటే వచ్చి, నాలుగు రోజులుంటేనే కానీ, నాకు తృప్తి వుండదు...ప్లీజ్..తప్పకుండా రారా"– శ్రీకాంత్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు పరంజ్యోతి. రైలు కదిలింది...పరంజ్యోతి చేతిలోంచి, తన చేతిని లోపలకు తీసుకున్నాడు శ్రీకాంత్. ఇద్దరి కళ్ళల్లోనూ నీరు కదిలింది.

శ్రీకాంత్ కనిపించేంతవరకూ రైలుతో నడిచి చేయి ఊపుతూ ఆగిపోయాడు పరంజ్యోతి.

రైలు గ్రీన్ సిగ్నల్ దాటింది.

శ్రీకాంత్ వెనుక సీటుకు జారగిలబడి – కళ్ళు మూసుకున్నాడు.

"సారీరా జ్యోతీ! అబద్ధం చెప్పకపోతే నువ్ నీ జీవితాన్ని నీ చేజేతులా నాశనం చేసుకుంటావని భయంవేసింది. అందుకే నిజాన్ని దాచుకున్నాను... సరోజ...ఆమె కాదు...! ఆమె...ఆమె నీ భార్య!... సావిత్రి!" అంటూ గొణుక్కు–న్నాడు!

———